**నీలగిరి ఎక్స్‌ప్రెస్**

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 27 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 5-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది -( దత్తపది)

(చిలక)పలుకు పలుకు చిన్నవయసునందు
(పలక)చేతబెట్టి బడికిపంప
(అలక)పాన్పునెక్కి వలదని యేడ్చుచు
(నలక)పడినయట్లు నలిచె కన్ను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# కేరళను తాకిన నైరుతి రుతుపవనం



- మరో వారంలో తెలంగాణకు చేరుకునే అవకాశం
- కేరళ, తమిళనాడులో భారీ వర్షాల హెచ్చరిక
- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యమైన రుతుపవనాలు
- సాధారణం కంటే తక్కువ వర్షపాతంపై ఐఎండీ అంచనా

తిరువనంతపురం

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

-మిగతా 2 లో

# మమతకు మరో షాక్



2 లో

- టీఎంసీని వీడనున్న 20 మంది ఎంపీలు..
- మమతకు వరుసగా ఎదురవుతున్న ఎదురుదెబ్బలు
- ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లోనూ అసంతృప్తి
- పార్లమెంట్‌లో టీఎంసీ బలానికి గండేనా?
- పార్టీ మార్పుపై ఉన్నతస్థాయిలో చర్చల ప్రచారం
- 28 ఏళ్ల చరిత్రలోనే క్లిష్ట పరిస్థితి
- కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద పార్టీ హోదాకు ముప్పు

# పాలమూరుపై సీఎం ఫోకస్

**పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ ప్రత్యేక సమీక్ష**

- హెలికాప్టర్‌లో సాగునీటి పథకాల పరిశీలన
- ప్రాజెక్టుల పురోగతిపై అధికారులను ప్రశ్నించిన సీఎం
- కొడంగల్ ఎత్తిపోతల పనులపై ప్రత్యేక దృష్టి
- కీలక నిర్మాణాల స్థితిగతులపై క్షేత్రస్థాయి ఆరా
- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం
- గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

మహబూబ్‌నగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు.

-మిగతా 2 లో





# ట్రంప్‌కు షాక్

- ఇరాన్‌పై యుద్ధం ఆపేయాలంటూ ప్రతినిధుల సభ తీర్మానం!
- కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి అన్న తీర్మానం
- డెమోక్రాట్లకు మద్దతిచ్చిన రిపబ్లికన్లు
- 215-208 ఓట్ల తేడాతో ఆమోదం
- అధ్యక్ష అధికారాలపై నియంత్రణకు ప్రయత్నం
- సెనేట్ ఆమోదం కోసం తదుపరి అడుగు
- వీటో అధికారంపై ఉత్కంఠ

న్యూయార్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో షాక్ తగిలింది. ఇరాన్‌పై సైనిక చర్య నిలిపివేసే తీర్మానానికి అమెరికా ప్రతినిధుల ఆమోదం తెలిపింది. ఇక నుంచి ఇరాన్ మీద మిలిటరీ యాక్షన్ చేపట్టాలంటే కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఉండాల్సిందేనని ఒక తీర్మానాన్ని పాస్ చేసిందినలుగురు రిపబ్లికన్లు డెమోక్రాట్లతో చేతులు కలపడంతో 215-208 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. ఫిబ్రవరి నెల నుంచి ట్రంప్ ఇష్టానుసారంగా మిలిటరీ వ్యవస్థను వాడుతున్నారని.. ఆయన అధికారాలను నియంత్రించేందుకు ఈ తీర్మానం

-మిగతా 2 లో




# ఆ స్థల వివాదంలో జోక్యం చేసుకోబోం..

- హైకోర్టుకు హైడ్రా హామీ!
- కూకట్‌పల్లిలోని 13.17 ఎకరాల స్థలంపై ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్లు
- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలపై గత విచారణలో హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- 24 గంటల్లోగా నిర్మాణాలను పూర్వ స్థితికి తేవాలన్న న్యాయస్థానం ఆదేశాలు
- హైడ్రా వివరణతో తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసిన జస్టిస్ నగేశ్ భీమపాక

హైదరాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మేడ్చల్- మలాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 1003 నుంచి 1006 వరకు ఉన్న 13.17 ఎకరాల స్థలం వ్యవహారంలో తాము జోక్యం చేసుకోబోమని హైడ్రా హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఈ స్థలం విషయంలో ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలుకావడం లేదంటూ ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ మూడు వేర్వేరు కోర్టు ధికరణ పిటిషన్లను దాఖలు చేసింది. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం విచారణ చేపట్టగానే హైడ్రా తరపు న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. కోర్టు ఆదేశించిన వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని చెప్పా రు. దీంతో న్యాయమూర్తి కోర్టు ధికరణ పిటిషన్లపై విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారుపిటిషనర్‌కు చెందిన నిర్మాణాలను కూల్చేసిన వ్యవహారంపై గతంలో తీవ్రంగా స్పందించిన హైకోర్టు,

-మిగతా 2 లో



# కాంగోలో విజృంభిస్తున్న ఎబోలా.

- ఐసోలేషన్ కేంద్రాల్లోంచి 11 మంది రోగులు పరార్..!
- మృతదేహాన్ని వదిలి పారిపోయిన సిబ్బంది
- మానవతా సాయానికి ఆటంకం కలిగిస్తున్న సాయుధ గుంపులు
- కాంగోలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదు -- 62 మంది మృతి
- ఉగాండాలో కూడా ఎబోలా వ్యాప్తి -- 15 కేసులు, ఒక మరణం నమోదు

న్యూఢిల్లీ,

ఆఫ్రికా ఖండంలోని కాంగో దేశంలో ఎబోలా వైరస్ విజృంభిస్తున్నది. ఈ క్రమంలో ఎబోలా సోకిన 11 మంది పేషెంట్లు ఐసోలేషన్ కేంద్రాల నుంచి పరారవడం ఆందోళనలు రేకెత్తించింది. ఇదిలావుంటే ఎబోలా వ్యాధితో మృతిచెందిన వారిని ఖననం చేసే బృందం పై కటానా పట్టణంలో మూక దాడి జరిగింది. దక్షిణ కివులోని కటానా పట్టణంలో ఎబోలాతో చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న బృందంపై కొందరు మూక దాడి చేశారు. దీంతో ఆ మృతదేహాన్ని అక్కడే వదిలేసి

-మిగతా 2 లో

# ఇండియా కూటమికి డీఎంకే షాక్!



- జూన్ 8న ఢిల్లీ భేటీ బహిష్కరణ
- కాంగ్రెస్ తీరుపై తీవ్ర ఆగ్రహం.. ద్రోహం చేసిందంటూ మండిపాటు
- శ్రేణుల మనస్తాపం.. క్యాడర్ భావాలకు స్టాలిన్ గౌరవం
- కూటమికి దూరంగా ఉన్నా.. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుకు మద్దతు

న్యూఢిల్లీ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని

-మిగతా 2 లో

### మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం'

- పేపర్ లీక్ వివాహాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయి
- నీట్ విద్యార్థిని మరణం కేవలం బలవన్మరణం కాదు
- అవినీతి, కుమ్మక్కైన విద్యావ్యవస్థ చేసిన ఘోరం
- నీట్ విద్యార్థిని బలవన్మరణంపై రాహుల్ స్పందన



2 లో

# దేశానికి యువతే ప్రాణం

**యువతతోనే మార్పు సాధ్యం**



- బాధ్యతాయుత నాయకత్వం కోసం కృషి
- జనసేన ప్రయాణంలో యువత పాత్ర కీలకం
- రాజకీయాల్లో కొత్త తరానికి అవకాశం రావాలి
- దేశాన్ని ముందుకు నడిపేది యువశక్తే
- ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత..

-మిగతా 2 లో

# 50 నుంచి 100 శాతం భూముల విలువ పెంపు

**కీలక వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి**



- జూన్ 5 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయని ప్రకటించిన ప్రభుత్వం
- ఈ పెంపుతో ఖజానాకు రూ.1,400 కోట్ల అదనపు ఆదాయం అంచనా
- రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు లేదని, సబ్-రిజిస్ట్రార్ల అధికారాలకు కోత విధించినట్టు వెల్లడి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జూన్ 5వ తేదీ నుంచి సవరించిన కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలను సవరించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ముఖ్యంగా డిమాండ్ ఉండే శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలో

-మిగతా 2 లో

# కేరళను తాకిన నైరుతి రుతుపవనం

మొదటి తరువాయి



అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# మమతకు మరో షాక్

- టీఎంసీని వీడనున్న 20 మంది ఎంపీలు..
- మమతకు వరుసగా ఎదురవుతున్న ఎదురుదెబ్బలు
- ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లోనూ అసంతృప్తి
- పార్లమెంట్‌లో టీఎంసీ బలానికి గండేనా?
- పార్టీ మార్పుపై ఉన్నతస్థాయిలో చర్చల ప్రచారం
- 28 ఏళ్ల చరిత్రలోనే క్లిష్ట పరిస్థితి
- కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద పార్టీ హోదాకు ముప్పు



**కోల్‌కతా**
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టీఎంసీ అధినేత్రికి మరో భారీ షాక్ తగిలే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీకి చెందిన సుమారు 60 మంది ఎమ్మెల్యేలు చీలిపోయి వేరే కుంపటి పెట్టుకున్నారు. ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోని మమతకు పార్టీకి చెందిన ఎంపీలు కూడా అదే మార్గంలో పయనించేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నారు. 28 ఏండ్ల పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని సంక్షోభాన్ని టీఎంసీ ఎదుర్కొంటున్నది. టీఎంసీకి చెందిన ఎంపీల్లో సగం మంది బీజేపీలో చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. సుమారు 20 మంది ఎంపీలు కమలం పార్టీలో చేరేందుకు ఉన్నత స్థాయిలో చర్చలు జరుపుతున్నారని వార్తా కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం టీఎంసీకి లోక్‌సభలో 28 మంది, రాజ్యసభలో 13 మంది కలిపి మొత్తం 41 మంది ఎంపీలు ఉన్నారు. వీరిలో 20 మంది పార్టీని మారితే పార్లమెంట్‌లో ఆ పార్టీ బలం సగానికి తగ్గిపోతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక ఎంపీలున్న పార్టీ టీఎంసీయే.

# ట్రంప్‌కు షాక్

మొదటి తరువాయి



ప్రవేశపెట్టినట్టు ప్రతినిధుల సభ చెప్పింది. ఈ తీర్మానానికి సెనేట్ ఆమోదం అవసరం ఉంది. ఒకవేళ అక్కడ కూడా పాస్ అయితే అప్పుడు అధ్యక్షుడి వీటో అధికారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# ఆ స్థల వివాదంలో జోక్యం చేసుకోబోం..

మొదటి తరువాయి

వాటిని 24 గంటల్లోగా పూర్వ స్థితిలో ఉండేలా చ ర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఓవైపు హైకోర్టు ఆదేశాలు, మరోవైపు స్వయంగా హైడ్రా హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పిటిషనర్‌కు చెందిన స్థలంలోని కాంపౌండ్ ఫెన్సిం గ్, సెక్యూరిటీ గదులు, ప్రవేశద్వారాలను కూల్చివేయడాన్ని గత విచారణలో హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. యంత్రాలను ఇతర పరికరాలను ధ్వంసం చేయడం, విద్యుత్తు సరఫరా నిలిపివేయడాన్ని ఆక్షేపించింది. హైకోర్టు ఆదేశాల తర్వాత కూడా హైడ్రా జోక్యం చేసుకుంటున్నదని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. అయితే హైడ్రా హామీని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

# పాలమూరుపై సీఎం ఫోకస్

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాత్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల



నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

# ఇండియా కూటమికి డీఎంకే షాక్!

మొదటి తరువాయి



డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# దేశానికి యువతే ప్రాణం

మొదటి తరువాయి

పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# లాసెట్‌లో మెరిసిన దేవ్‌జీ


**-ఆరు పదుల వయస్సులో గన్ను వదిలి పెన్ను పట్టిన మావోయిస్ట్ మాజీ నేత**
**-గత నెల 18న లాసెట్‌కు హాజరు**
**-రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు**



**కోరుట్ల,**
సుదీర్ఘకాలంపాటు గన్ను పట్టి పోరాటాలు చేసిన మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ లాసెట్‌లో మెరిశారు. విప్లవోద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి అడుగుపెట్టిన ఆయన, కృషి, పట్టుదల ఉంటే ప్రతిభకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించారు. ఆరు పదుల వయసులో గత నెల 18న ఐదేండ్ల న్యాయవిద్యను అభ్యసించడానికి ప్రవేశ పరీక్ష రాశారు. గురువారం విడుదలైన ఫలితాల్లో 349వ ర్యాంకు సాధించి ఔరా అనిపించారు.

# కాంగోలో విజృంభిస్తున్న ఎబోలా.

మొదటి తరువాయి



ఆ బృందం పారిపోయింది. దీంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. దీనివల్ల వైరస్ మరింత వేగంగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక ఇటూరిలో ఉన్న ఐసోలేషన్ కేంద్రాల నుంచి 11 మంది ఎబోలా రోగులు పారిపోయారు. అదే సమయంలో కొన్ని ప్రావిన్స్‌లలో సాయుధ మూకలు మానవతా సాయానికి ఆటంకం కలిగిస్తున్నాయి. దాంతో అక్కడి భద్రతా పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్నాయి. కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించారు. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు తెలిపారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా.. ఒక మరణం సంభవించింది. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను స్క్రీనింగ్ చేస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం’




**న్యూఢిల్లీ:**
నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాహాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువతరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మోగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపూర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు పెట్టారు. “ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది. ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షలు అప్పు తీసుకున్నారు. నాగపూర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడిది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుమ్మక్కైన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈపాటికే తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదు.”-- రాహుల్ గాంధీ.


### 50 నుంచి 100 శాతం

# భూముల విలువ పెంపు

మొదటి తరువాయి



పెంపు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు సబ్-రిజిస్ట్రార్ల అధికారాలను గణనీయంగా తగ్గించినట్టు తెలిపారు. కొత్త రేట్లపై ప్రజల సందేహాలు, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరగవని అన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితాలో పెట్టిందని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి కూడా మంత్రి మాట్లాడారు. ఈ పథకం కోసం ఇప్పటివరకు రూ.7,000 కోట్లు విడుదల చేశామని, ఒకవేళ కేంద్రం నుంచి నిధులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందని భరోసా ఇచ్చారు.




# గిరి ప్రదక్షిణలో గ్యాంగ్ రేప్..

-అరుణాచలంలో అమానుషం
-ఇద్దరు మహిళలపై సామూహిక లైంగికదాడి
-8 మంది నిందితుల అరెస్ట్..



**తిరువణ్ణామలై,జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలై (అరుణాచలం)లో దారుణాలు చోటుచేసుకున్నాయి. గిరి ప్రదక్షిణకు వచ్చిన ఇద్దరు యువతులపై ఒక ముఠా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. ఈ దారుణానికి పాల్పడిన ముఠాలోని 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందులో ఒకరు మైనర్ కూడా ఉన్నాడు. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని ధర్మపురికి చెందిన ఒక వివాహిత గత నెల 30న తన స్నేహితులతో కలిసి గిరి ప్రదక్షిణకు వచ్చింది. ప్రదక్షిణ పూర్తయిన తర్వాత వీరితో వచ్చిన వారు ముందు వెళ్లగా, పెద్ద కోలాపాడి వద్ద ఆమె, మరో స్నేహితుడు వాహనం ఆపి మాట్లాడుకుంటుండగా, మారణాయుధాలతో వచ్చిన ఒక ముఠా వారిని బెదిరించింది. తర్వాత వారిని అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లింది. వివాహితపై ఆ దుండగులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు.తర్వాత వారిని నగ్నంగా చేసి వీడియో తీశారు. మరునాడు ఆ వివాహితకు ఆ వీడియోను పంపి లక్ష రూపాయలు ఇవ్వాలంటూ బెదిరించారు. దీంతో ఆమె రూ.4 వేలు చెల్లించింది. తర్వాత ధర్మపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరువణ్ణామలై పడమర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తిరువణ్ణమలైలో ఇలాంటి ఘటనే మరునాడు సంభవించింది. మే 31వ తేదీన తిరువణ్ణామలై మున్సిపాల్టీ పరిధికి చెందిని 23 ఏండ్ల యువతి గిరి ప్రదక్షిణకు వచ్చింది. గిరిప్రదక్షిణ చేస్తుండగా కాళ్లు నొప్పులు పుట్టడంతో అడిఅన్నామలై అనే గ్రామం వద్ద కూర్చుని తన స్నేహితుడిని పిలిచింది. తర్వాత ఇద్దరూ కలిసి సమీపంలోని హోటల్‌లో టిఫిన్ పార్సిల్ కట్టించుకుని అయ్యంపాలయం బైపాస్ రోడ్ వద్దకు వెళ్లగా, అక్కడ ఒక ముఠా వారిని బెదిరించి అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లింది. అక్కడ ఇద్దరినీ చిత్రహింసలు పెట్టారు.

# ఫారో దీవుల్లో ఘోరం..


-700 కుపైగా తిమింగళాలు, డాల్ఫిన్‌ల ఊచకోత..!



**న్యూఢిల్లీ,జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నార్త్ అట్లాంటిక్ సముద్రంలోని ఫారో దీవుల్లో ఘోరం జరిగింది. అక్కడి సంప్రదాయమైన 'గ్రైండాడ్రాప్' ఉత్సవంలో భాగంగా ఏకంగా ఒక్క రోజులో 700కు పైగా తిమింగలాలు, డాల్ఫిన్ల ను ఊచకోత కోశారు. దాంతో సముద్ర తీరం ఎర్రగా మారిపోయింది. మే 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచ సముద్ర పర్యావరణ సంస్థ 'సీ షెఫర్డ్ (సాము సాష్ట్రవజూష్ట్రవతీస)' ప్రకారం.. టోర్షావన్‌లో సాండెగెర్డి బే వద్ద వేటగాళ్లు 402 పైలట్ తిమింగలాలను , నాలుగు బాటిల్‌నోస్ డాల్ఫిన్‌లను ఒడ్డుకు తీసుకొచ్చి.. వాటి శరీరాలని చీల్చారు.అదేవిధంగా స్కాలబోట్నూర్‌లో 168 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లు, హాల్విక్‌లో 132 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లను చంపేశారు. వాటిని చంపేందుకు ఉపయోగించే ఆయుధాల కొరత ఏర్పడటంతో.. కొక్కేలు, కత్తులు ఉపయోగించి వాటి శరీరాలను చీల్చేశారు. దాంతో అవి ఒడ్డున విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి. ఈ వధను చిన్నారులు సహా అనేకమంది సముద్రపు ఒడ్డున ఉండి చూడటం గమనార్హం. సీ షెఫర్డ్‌లోని ఫారో దీవుల డైరెక్టర్ వాలెంటీనా క్రాస్ట్.. దీన్ని తీవ్రంగా ఖండించారు. అమాయక జంతువులను ఇంత క్రూరంగా బాధించి చంపడాన్ని సమర్థించలేమన్నారు.ఈ సందర్భంగా ఈ సంప్రదాయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ సామూహిక వధ అనేది 1000 ఏళ్ల నాటి సంప్రదాయంగా అక్కడి వారు చెబుతున్నారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆధునిక కాలంలో ఇది అనాగరికమైన చర్య అని, కాలం చెల్లిన పద్ధతిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వెంటనే దీన్ని ఆపేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ సామూహిక వధకి ముందురోజు ఫారోస్ పార్లమెంటులో వేటాడే డాల్ఫిన్‌ల కోసం ఉన్న సంక్షేమ చట్టాన్ని సవరించడం గమనార్హం.

# రాజ్యసభకు 11 మంది అభ్యర్థుల్ని ప్రకటించిన బీజేపీ..

## పోటీలో ఉన్నది వీరే



**న్యూఢిల్లీ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : రాజ్యసభకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల్ని బీజేపీ ప్రకటించింది. ఇందులో ఒడిశాకు జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థిని కూడా ప్రకటించింది. రాజ్యసభలో ఖాళీ అయ్యే స్థానాలకు రెండేళ్లకోసారి ఎన్నికలు జరుగుతాయి. అవి ఈ ఏడాదికి సంబంధించి జూన్ 18న జరగనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ఉన్నతస్థాయి సమావేశం న్యూఢిల్లీలో జరిగింది.ఈ సమావేశంలో చర్చించిన అనంతరం బీజేపీ తన అభ్యర్థుల్ని ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఈ జాబితాను విడుదల చేశారు. రాజస్థాన్ నుంచి సతీష్ పూనియా, అల్కా గుర్జార్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజ్నీష్ అగర్వాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తగాక్, గుజరాత్ నుంచి రాజుభాయ్ శుక్లా, ముకేష్ భాయ్ రత్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్ర మేఘ్‌జిభాయ్ కంజారియా , మణిపూర్ నుంచి శార్దా దేవి, ఒడిశా నుంచి శ్రీ దేవాసిష్ సమంతరాయ్ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. ఈ స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ భావిస్తోంది. జూన్ 18న 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.మొత్తం 10 రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఇందులో ఏపీతోపాటు తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, మేఘాలయ, ఝార్ఖండ్, మిజోరం, కర్ణాటక కూడా ఉన్నాయి. ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో 3 సీట్లు టీడీపీకి, ఒక సీటు జనసేనకు దక్కాయి. తమిళనాడులోని ఒక స్థానాన్ని టీవీకే కూటమి.. కాంగ్రెస్ పార్టీకి కేటాయించింది.

# ముస్లింలకు 5 మంత్రి పదవులివ్వాల్సిందే.. లేకపోతే తీవ్ర పరిణామాలు

డీకేకు ముస్లిం నేతల హెచ్చరిక



**బెంగళూరు జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : కర్ణాటకలో డీకే శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో ముస్లింలకు ఐదు మంత్రి పదవులు కేటాయించాలని ముస్లిం నాయకులు, మత పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. ముస్లింల ఓటర్లతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి మంత్రివర్గంలో తగు ప్రాతినిధ్యం కల్పించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. మత నాయకులు, మత పెద్దలు బెల్లినగర్‌లోని ఒక దర్గాలో బుధవారం సమావేశమయ్యారు.మంత్రివర్గంలో కాంగ్రెస్ నేతలు బీజడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఎన్ఏ హర్రీస్, తన్వీర్ సైత్, సలీమ్ అహ్మద్‌లకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను ఖాతరు చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్‌గా యూటీ ఖాదర్‌ను నియమించిన క్రమంలో మిగిలిన నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. అలా కాకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని ఒక నేత హెచ్చరించారు.

# సరోగసీ కేంద్రాల ద్వారా చైల్డ్ ట్రాఫికింగ్..

సుప్రీంకు అమికస్ నివేదన



**న్యూఢిల్లీ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫెర్టిలిటీ క్లినిక్‌లను నియంత్రించే నిబంధనల చట్రంలోని లోపాలను ఆసరాగా చేసుకుని పిల్లల అక్రమ రవాణా కొత్త నెట్‌వర్క్‌లు పుట్టుకొస్తున్నాయనే ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ), సరోగసీ కేంద్రాల ద్వారా పిల్లల అక్రమ రవాణాను నిరోధించడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అవసరాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది.ఏఆర్‌టీ, సరోగసీ కేంద్రాల ద్వారా జరిగే అక్రమ రవాణాను నివారించడానికి ఎటువంటి ప్రామాణిక కార్యాచరణ విధానం(ఎస్‌వోపీ) లేదని పేర్కొంటూ అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది అపర్ణాభట్ చేసిన వాదనలను పింకీ వర్సెస్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బాలల అక్రమ రవాణా కేసులో తమ 2025 ఏప్రిల్ తీర్పు అమలును ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

# 30 అత్యవసర ఔషధాల ధరలు తగ్గింపు


-రెండు మూడు నెలల్లో అందుబాటులోకి..
-జాబితాలో డయాబెటిస్, బీపీ మందులు కూడా



**న్యూఢిల్లీ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షుగర్, హై బీపీ, హృద్రోగాలు, ఇన్‌ఫెక్షన్లు, మహిళల ఆరోగ్య సమస్యలకు వాడే 30 అత్యవసర ఔషధాల ధరలను సవరించాలని నేషనల్ ఫార్మాస్యుటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో దీర్ఘకాలం ఈ వ్యాధులకు చికిత్స పొందుతున్న పౌరుల చికిత్స ఖర్చు తగ్గనుంది.అయితే ఈ తగ్గించిన ధరలు రోగులకు వచ్చే రెండు మూడు నెలల్లో అందుబాటులోకి వస్తాయని పరిశ్రమకు చెందిన ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతమున్న మందుల స్టాక్ పూర్తిగా అయిపోయిన తర్వాతే కొత్త మందుల అమ్మకం ప్రారంభమవుతుందని వారు చెప్పారు.

# 10వ తరగతి టీచర్లతో 12వ తరగతి పేపర్ల మూల్యాంకనం

మరో వివాదంలో సీబీఎస్ఈ



**న్యూఢిల్లీ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానం ప్రవేశపెట్టి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మరో నిర్వాకం వెలుగు చూసింది. 12వ తరగతికి ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఓఎస్ఎం విధానంలో అర్హత గల ఉపాధ్యాయులతో కాకుండా 10వ తరగతి టీచర్లతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించారు. ఢిల్లీ పేరెంట్స్ అసోసియేషన్‌కు చెందిన అపరాజిత గౌతమ్ దీనికి సంబంధించిన పలు నిజాలను వెల్లడించారు.

# మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



**కరీంనగర్ రూరల్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తీగలగుట్టపల్లి విద్యారణ్యపురిలో నివాసముంటున్న దొండు అరుణ్‌కుమార్ (35) మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న అరుణ్‌కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవలు పెట్టేవాడని పోలీసులు తెలిపారు. నిన్న రాత్రి భార్యతో గొడవపడి ఆమెను కూర కొనడానికి పంపించి, ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో హాల్‌లో ఉరివేసుకున్నాడు. భార్య తిరిగి వచ్చి చూసే సరికి ఆయన వేలాడుతూ ఉండగా, స్థానికులు దింపి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు శవాన్ని అప్పగించినట్లు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. కుటుంబ కలహాలు, మద్యపానం కారణంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది.

# ఒక్కసారిగా మారిన వాతావరణం

**- ఉరుములు మెరుపులతో భారీ వర్షం**



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారింది. ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు, బాటసారులు తడిసి ముద్దయ్యారు. ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నప్పటికీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కరీంనగర్ నగరంలో వర్షం ఉపశమనం కలిగించగా, నీటి నిల్వలతో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తాయి.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభ నిర్వహణ



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రేకుర్తి పుష్పవల్లి గార్డెన్స్‌లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై ప్రజలు నేరుగా అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. తరువాత రేకుర్తి ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, అధికారులు కలిసి మొక్కలు నాటారు. ప్రజా సమస్యల పరిష్కారం, పచ్చదనం పెంపు లక్ష్యంగా రేకుర్తిలో వార్డు సభలు నిర్వహించబడ్డాయి.

# నాలుగవ వార్డులో సర్పంచ్ పర్యటన

**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని నాలుగవ వార్డులో గురువారం సర్పంచ్ కప్పల ప్రవీణ్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికి నీటి కాలువను పరిశీలించి, త్రాగునీటిని వృథా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వార్డులో ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు సభ్యుడు మడుపు నరేందర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



నాలుగవ వార్డులో మురికి కాలువను పరిశీలిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ వార్డు సభ్యులు మడుపు నరేందర్

# ప్రకృతి పరిరక్షణే మానవాళి మనుగడకు పునాది

ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకుంటూ మానవాళికి ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని గుర్తుచేస్తోంది. 1972లో స్టాక్‌హోమ్ సమావేశం అనంతరం ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించగా, 1973లో భూమి ఒక్కటే అనే ఇతివృత్తంతో మొదటిసారి నిర్వహించారు. అప్పటి నుంచి ఇది ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పర్యావరణ అవగాహన కార్యక్రమంగా నిలిచింది. 2025లో ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై దక్షిణ కొరియా ఆతిథ్యమిచ్చిన వేడుకలు ప్రపంచవ్యాప్తంగా చైతన్యం కలిగించాయి. ఈ సంవత్సరం అజర్‌బైజాన్ ఆతిథ్య దేశంగా నిలుస్తూ, బాకు నగరంలో జరిగే వేడుకలు వాతావరణ మార్పులు, హరితాభివృద్ధి, ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాలపై అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించనున్నాయి. ఎనిమిది రకాల వాతావరణ వ్యవస్థలు కలిగిన అజర్‌బైజాన్ జీవ వైవిధ్యానికి నిలయంగా, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక శక్తి వినియోగం, ప్లాస్టిక్ నియంత్రణలో ముందంజలో ఉంది. భారత్ కూడా పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. స్వచ్ఛ భారత్ మిషన్, గ్రీన్ ఇండియా మిషన్, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ వంటి కార్యక్రమాల ద్వారా కాలుష్య నియంత్రణ, సౌరశక్తి అభివృద్ధి, అడవుల విస్తరణలో విశేష ఫలితాలు సాధిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి దేశాలలో భారత్ ఒకటిగా ఎదుగుతోంది.



తెలంగాణ రాష్ట్రం హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కోట్లాది మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం, చెరువుల పునరుద్ధరణ, పట్టణ హరితవనాల అభివృద్ధి వంటి చర్యలు రాష్ట్రాన్ని హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాయి. అయితే పట్టణీకరణ, వాహన కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యమూ. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వినియోగించడం, కాలుష్యాన్ని నియంత్రించడం వంటి చిన్న చర్యలే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందిస్తాయి.

**ఒక మొక్క నాటుదాం- భూమాతను కాపాడుదాం**

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్,**
**అధ్యాపకులు**



# నాణ్యమైన విద్యపై డిఇఓ ప్రశాంత్ రెడ్డి దృష్టి


**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచేందుకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సందర్భంగా ఈ సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడు నలుమాసు సుదర్శన్ ప్రధానోపాధ్యాయులు డిఇఓ సూచనలకు అనుగుణంగా ముందుకు సాగుతారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాపల్లి శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరగా,





త్వరలోనే నిర్వహిస్తామని డిఇఓ హామీ ఇచ్చారు. అదే రోజు ఎస్టీటీయూ నాయకులు కూడా డిఇఓ ప్రశాంత్ రెడ్డిని కలిసి అభినందించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న సమస్యలపై ఒక రోజు సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కోశాధికారి అనురాధ, కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, డి. శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, వి. శ్రీనివాస్, జిల్లా పరీక్షల కార్యదర్శి భగవంతయ్య, మండల విద్యాధికారులు శోభారాణి, శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి, ఊకంటి విజేందర్ రెడ్డి, గడప శేఖర్, రవీందర్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పెద్దపల్లి జిల్లా నాయకులు కిషన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా విద్యా వ్యవస్థను బలోపేతం చేసి, నాణ్యమైన విద్యను అందించడమే తన ప్రధాన లక్ష్యమని డిఇఓ ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో దత్తాత్రేయ స్వామివారికి విశేషపూజలు



**శ్రీశైలం, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లోకకల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానంలో గురువారం దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామివారికి ప్రతి గురువారం సర్కారీ సేవగా ఈ కైంకర్యం జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమం నిర్విఘ్నంగా సాగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపి, అనంతరం పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపముగా అవతరించిన త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుని ఆరాధనకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల సంబంధం ఎంతో ప్రత్యేకమని పురాణాలు చెబుతున్నాయి. త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులు తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో గోదావరి తీరం పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహసరస్వతిగా అవతరించి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతం ఆచరించినట్లు గురుచరిత్ర పేర్కొంటుంది. నృసింహసరస్వతి స్వామి శ్రీశైలంలోని పాతాళగంగలో అవతార సమాప్తి చేసి, అదృశ్య రూపంలో భక్తులను రక్షించేందుకు నిర్ణయించుకున్నారని గ్రంథాలు చెబుతున్నాయి.

# నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బీపీఎల్ విజన్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించబడనుంది. ఈ శిబిరాన్ని గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, శిబిరం ద్వారా అవసరమైన వైద్యసేవలు అందించబడతాయని వారు పేర్కొన్నారు.

# ఉపాధి కూలీల కోసం ఉద్యమిస్తాం

**వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



**నందికొట్కూరు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధి కూలీల కడుపు మాడితే ఊరుకోమని, వారానికి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు గురువారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో జరిగిన నిరసనలో డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడు సంపంగి వెంకటేశ్వర్లుతో కలిసి ఉపాధి పనుల వద్ద కూలీల సమస్యలను వెలుగులోకి తెచ్చిన ఆయన మాట్లాడుతూ, "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కూలీల జీవనం కష్టాల్లో పడుతోంది. వారానికి సంత మార్కెట్ జరుగుతుందని, కూలీలు సరుకులు కొనుగోలు చేసుకునేందుకు ప్రతివారం బిల్లులు చెల్లించాలి" అని అన్నారు. ఉపాధి పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని, గడ్డపార, గంప, సలిక, పికాసి వంటి పనిముట్లు ఇవ్వాలని, రెండు పూటల పేస్ యాప్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి మేటీలకు రూ.5,000 పారితోషకం, సెల్‌ఫోన్, టేపు, పెన్ను సరఫరా చేయాలని, ఉపాధి సిబ్బంది వేతనాలను ప్రతినెల చెల్లించాలని కోరారు. ఈ నిరసనలో మనోరాజ్, రాణి, మహేశ్వరి, చిన్న మౌలాలి, ప్రసాద్, కరీం, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాములపల్లిలో స్వచ్ఛతపై అవగాహన



**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని రాములపల్లిలో గురువారం స్వచ్ఛ గావ్--జలవాయు కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. గ్రామంలోని కిరాణా షాపులను సందర్శించి, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నాలుగు రకాల చెత్తను వేరు చేసే డస్ట్‌బిన్ల వినియోగంపై వివరించారు. అనంతరం ఎస్ఎల్ఎం షెడ్‌ను సందర్శించి తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, కార్యదర్శి, జీపీవో, ఆశా కార్యకర్తలు, స్వశక్తి సంఘాల మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**పాలకుర్తి, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామంలోని జారుబండ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ గురువారం సందర్శించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తోందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా టోపీలు, గ్లూకోవిటా పానీయాలను అందజేశారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో అత్యవసర మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనాలి ఠాకూర్, సర్పంచ్ తోట స్వప్న మహేష్, ఉప సర్పంచ్ బండ కుమార్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మల్లెత్తుల శ్రీనివాస్, అమ్ముల కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ బుట్టి శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు.

# బడిబాట పోస్టర్లను ఆవిష్కరించిన డిఇఓ ప్రశాంత్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంకమ్మతోట ప్రాంతంలోని పిఎం శ్రీ జిహెచ్ఎస్ ధన్గర్వాడి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రచార పోస్టర్లను జిల్లా విద్యాశాఖాధికారి కె. ప్రశాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్ఎస్‌సి 2026 ఫలితాల్లో పాఠశాల అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని, ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించగలవని నిరూపించాయని అభినందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు డిజిటల్ ల్యాబ్‌లు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, ఉచిత ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉన్నాయని, రాబోయే విద్యా సంవత్సరానికి విస్తృత ప్రచారం ద్వారా మరిన్ని విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు మాగంటి శ్రీనివాస్, బి. జ్యోతి, వి. రాజేష్, వి. శ్రీదర్ రెడ్డి, సాయి వరూధ్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రగతి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ప్రతిభతో సాధ్యమవుతోందని డిఇఓ ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎల్‌నినో ముప్పు -- ఆరుతడి పంటల వైపు రైతులు




**పాలకుర్తి, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్, ఈసాలతక్కలపల్లి, ఎలకలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశాల్లో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ మాట్లాడుతూ, వరిలో స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేయాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే పప్పు ధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం క్షీణత, వాయు కాలుష్యం పెరుగుతుందని హెచ్చరిస్తూ, వాటిని భూమిలో కలిపి సేంద్రియ పదార్థాలుగా మార్చుకోవాలని సూచించారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న సన్నరక వరి వంగడాలను నాటడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ఆరుతడి పంటలే రైతులకు భద్రతాయుతమైన మార్గమని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు

జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం మనుగడకు ప్రకృతి పరిరక్షణ ఎంత ముఖ్యమో గుర్తు చేస్తుంది. గాలి, నీరు, నేల, చెట్లు, జంతువులు, ఇవి అన్నీ కలిసే పర్యావరణం. జీవన భాగాలు, నిర్జీవ భాగాలు పరస్పర చర్యలతోనే జీవకోటి కొనసాగుతుంది. 1972లో స్టాక్‌హోమ్ సమావేశంలో ఈ దినోత్సవం ప్రతిపాదించబడగా, 1973 నుంచి ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ మార్పులు, జీవవైవిధ్యం వంటి సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడమే దీని ఉద్దేశ్యం. మన కర్తవ్యాలు చిన్నవైనా ప్రభావం గొప్పది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, బట్ట సంచులు వాడడం, మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా




వినియోగించడం, చెత్తను రీసైకిల్ చేయడం, ఇవే పర్యావరణ పరిరక్షణకు మార్గాలు. సుస్థిర అభివృద్ధి సూత్రాలకు అనుగుణంగా వ్యర్థాలను తగ్గించడం, పునరుత్పాదక వనరులను వినియోగించడం భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందిస్తుంది. ప్రపంచ వాతావరణం వ్యాపారాలకు అవకాశాలు కల్పిస్తూనే ముప్పులను ఎదుర్కోవడానికి బలాన్ని ఇస్తుంది. అభివృద్ధి, వృద్ధి సాధించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవడం తప్పనిసరి.

**ఒక మొక్క నాటుదాం -- భూమాతను కాపాడుదాం**

**వ్యాసకర్త**
**మంగయ్య వెంకటేశం**

# పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం



**హుస్నాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని 1, 10, 12, 14, 20వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. సంబంధిత వార్డు కౌన్సిలర్ల అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో ప్రజల సమస్యలను చర్చించారు. 14వ వార్డు సభకు పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభల అనంతరం పట్టణంలో రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పరిశుభ్రత, క్రిమిసంహారక మందుల స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లడం వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం చెత్తను వేరు చేసి పురపాలక వాహనాలకు అందించాలని సూచించారు. వార్డులకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, సావుల మంజుల, కేశవేని రమేష్, గోపగోని శోభన్ గౌడ్, మున్సిపల్ అధికారులు, జవాన్లు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరమని వార్డు సభల్లో స్పష్టం చేశారు.

# గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న దిశలో కరీంనగర్ అడుగులు

**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేష్‌లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హిందీలో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. కరీంనగర్ చాలా వేగంగా గ్లోబల్ సిటీగా మారుతోంది. ఇది తెలంగాణకే గర్వకారణం. స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు, ప్రజల జీవితాలను




సులభతరం చేయడం అని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్‌ను ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు, సీసీటీవీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికైన కరీంనగర్ తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్ గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న దిశలో అడుగులు వేస్తోందని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.

# షికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం

**నాటు సారాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు**

**నందికొట్కూరు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు నంద్యాల స్క్వాడ్, నందికొట్కూరు ఎస్సై సిబ్బందితో కలిసి షికారిపేట కాలనీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి,



15 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా షికారి హైమ, షికారి లక్ష్మిలను అరెస్టు చేశారు. దాడుల్లో ఎస్సై రమేష్, ఎస్సై జఫరుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, శంకర్ నాయక్, కానిస్టేబుల్ సుధీర్ కుమార్, శివన్న, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ స్వతంత్రతకు ప్రత్యేక కేడర్ అవసరం

**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అవినీతి నిరోధక శాఖ ఏసీబీలో అధికారులను పోలీసు శాఖ నుంచి డిప్యూటేషన్ ద్వారా కాకుండా నేరుగా నియమించి, కానిస్టేబుల్ నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు ప్రత్యేక కేడర్ ఏర్పాటు చేయాలని అడ్వకేట్, మాజీ కార్పొరేటర్ ఏ.వి. రమణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రస్తుతం ఏసీబీలో పనిచేస్తున్న అధికారులు పోలీసు శాఖ నుంచి రావడం వల్ల సంస్థ స్వతంత్రతపై ప్రజల్లో సందేహాలు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



అవినీతిని నిర్మూలించే సంస్థ పూర్తిస్థాయిలో స్వతంత్రంగా ఉండాలంటే నియామకం నుంచి పదవీ విరమణ వరకు అదే శాఖలో పనిచేసే శాశ్వత కేడర్ అవసరమని సూచించారు. ఏసీబీ అధికారుల పనితీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక విజిలెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతూ, ట్రాప్ కేసులతో పాటు ఆదాయానికి మించిన ఆస్తులపై లోతైన విచారణలు జరపాలని అభిప్రాయపడ్డారు. చిన్న మొత్తాల లంచాల కంటే కోట్ల రూపాయల అక్రమ సంపదను వెలికితీయడం ద్వారా సమాజానికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఏసీబీని పూర్తిస్థాయి స్వతంత్ర దర్యాప్తు సంస్థగా మార్చి, అక్రమాస్తుల కేసులపై దృష్టి సారించాలని ఏ.వి. రమణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# ఎన్ఐఎస్ పాటియాలాలో సైక్లింగ్ కోచ్‌గా కంటె రాజు ఎంపిక



**హుస్నాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని నేతాజీ సుభాష్ జాతీయ క్రీడా విశ్వవిద్యాలయం, ఎన్ఐఎస్ పాటియాలాలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను సైక్లింగ్ కోచ్‌గా హుస్నాబాద్‌కు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కంటె రాజు ఎంపిక కావడం విశేషం. గత 20 సంవత్సరాలుగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా సేవలందిస్తూ, స్థానిక యువతకు పోలీస్ నియామకాల కోసం ఉచిత శిక్షణ ఇచ్చి అనేక మందిని ఉద్యోగాల్లో స్థిరపడేలా చేసిన ఘనత ఆయన సొంతం. కానిస్టేబుల్, ఎస్ఐ, ఆర్మీ జవాన్‌లతో పాటు ఒక ఐపీఎస్ అధికారిని కూడా తీర్చిదిద్దారు. సైక్లింగ్ క్రీడలో విద్యార్థులను రాష్ట్ర, జాతీయ, దక్షిణాసియా స్థాయిలలో రాణించేలా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. క్రీడా రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఎన్ఐఎస్ సైక్లింగ్ కోచ్ సీటు సాధించడం హుస్నాబాద్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కమిషనర్ టి. మల్లిఖార్జున్, కౌన్సిలర్లు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు మరియు పలువురు నాయకులు కంటె రాజును అభినందించారు. కంటె రాజు ఎంపిక హుస్నాబాద్ క్రీడా రంగానికి ప్రత్యేక గౌరవంగా నిలిచింది.

# జాతీయ రహదారిపై బీజేపీ మోసపూరిత ప్రకటనలు

-- సుంకే రవిశంకర్



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2016లోనే మంజూరైన జాతీయ రహదారిని కొత్తగా ఆమోదించినట్లుగా చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ విమర్శించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ, అప్పటి సీఎం కేసీఆర్, ఎంపీ వినోద్ కుమార్ కృషి ఫలితంగా ఎన్‌హెచ్-563 మంజూరైందని, టెండర్లు పూర్తయ్యాయని, భూసేకరణ, పరిహారం చెల్లింపులు కూడా జరిగాయని గుర్తుచేశారు. కరీంనగర్--వరంగల్ మధ్య పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అప్పటికే మంజూరైన పనులను కొత్తగా తెచ్చినట్లుగా బండి సంజయ్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తట్టెడు మట్టి కూడా తీయకుండా పదే పదే పనులు ప్రారంభించామంటూ ప్రజలను మోసం చేయడం తగదని హెచ్చరించారు. జాతీయ రహదారి పనులను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం ప్రజలు గమనిస్తున్నారని సుంకే రవిశంకర్ స్పష్టం చేశారు.

# వార్డు సభలలో అభివృద్ధిపై అవగాహన సదస్సు



**జమ్మికుంట, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీలో వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన, కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం 12, 19, 20, 23, 24, 26వ వార్డుల్లో సభలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, ఘన వ్యర్థాల నిర్వహణ, రైన్ వాటర్ హార్వెస్టింగ్, డ్రైన్ల శుభ్రపరిచే పనులు, తాగునీటి సరఫరా, పారిశుధ్య చర్యలు, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు వివరించారు. సభల్లో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్, కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహమ్మద్ ముంతాజ్ అలీ (జావిద్), ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, భాస్కర్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే సభల ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

# లయన్స్ క్లబ్ శాతవాహన సమక్షంలో అన్నప్రసాద్ వితరణ

**కరీంనగర్ రూరల్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన జోన్ ఛైర్పర్సన్ మానువాడ శంకర్ జన్మదినం సందర్భంగా 20వ డివిజన్‌లో పనిచేస్తున్న 30 మంది పారిశుధ్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పర్వతం మల్లేశం హాజరై ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు తృప్తిని కలిగిస్తాయని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు ననువాల గిరిధర్ రావు, కార్యదర్శి పాశం నర్సింహా రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ అక్కినపల్లి అజయ్ కుమార్, బండారి గంగాధర్, ఆరెపెల్లి సంపత్, లేడీ మానువాడ వనజ, పొత్తూరి దేవదాస్, రాజేష్, ఆరెపెల్లి శ్యామ్, సంటి కుమార్, రామకృష్ణ, మున్సిపల్ జవాన్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు, నిర్మాణ కార్మికులకు అన్నప్రసాదం అందించడం ద్వారా లయన్స్ క్లబ్ శాతవాహన సేవా భావాన్ని ప్రతిబింబించింది.

# వర్షాల నియంత్రణకు, ప్రజల సహకారంకై మున్సిపాలిటీలో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్

**జమ్మికుంట, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారీ వర్షాల కారణంగా ప్రజల సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ 24 గంటలపాటు పనిచేసే ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ప్రజలు 8712037400 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించి సమాచారం అందించవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏ. ఆకాశ్, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు బి. సాయికుమార్ విధులు నిర్వహిస్తారు. మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, భారీ వర్షాల కారణంగా ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వర్షాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమని మున్సిపాలిటీ స్పష్టం చేసింది.

# రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి సన్నరక వరి సాగు చేయాలి



**హుస్నాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరిలో సన్న రకాలను సాగు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి స్వామి రైతులకు సూచించారు. మడద గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా వానకాలం పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సన్నరక వరి రకాలను నాటాలని సూచించారు. వానకాలం ఎరువుల యాజమాన్యం, ఆయిల్ పామ్ సాగు సబ్సిడీ వివరాలు రైతులకు తెలియజేశారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నష్టాలు కలుగుతాయని, వాటిని నేలలో కలిపితే భూసారం పెరుగుతుందని వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని, వాటిని నేలలో దున్నితే సేంద్రియ పదార్థం పెరిగి పంట దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఎంపీఓ రమేష్, సర్పంచ్ బంటు సంపత్, ఉప సర్పంచ్ బూడిద శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ వనిత, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి సన్నరక వరి సాగు చేయాలని అధికారులు సూచించారు.లి

# రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఏర్పాటు



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అలియాబాద్‌లో జరిగిన రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగర్తి చంద్రారెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా, సంది తిరుపతి రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సహ అధ్యక్షులుగా పట్లోళ్ల నాగిరెడ్డి, పురుమాని లింగారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బండ గోపాల్ రెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, విరాటి దేవేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా పాండురంగా రెడ్డి, నేరెళ్ల భూమ్ రెడ్డి, పోద్దుటూరి నారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా గుర్రం పాపిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దోంగల బాపు రెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఏలేటి రాంరెడ్డి, కొండల్ రెడ్డి, బాల్ రెడ్డి, కార్యదర్శులుగా యెల్మకన్నె దశమంత రెడ్డి, కొప్పుల గంగారెడ్డి, ముఖ్య సలహాదారుగా గడ్డం రమేష్ రెడ్డి ఎన్నికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఏనుగు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి ఐక్యవేదిక సామాజిక ఐక్యత, విద్యా ప్రోత్సాహం, యువత అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. నూతన అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వేదికను బలోపేతం చేస్తామని, ప్రధాన కార్యదర్శి సంది తిరుపతి రెడ్డి సభ్యుల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు.

# తెలంగాణ రహదారుల అభివృద్ధికి కేంద్రం భారీ నిధులు



**జగిత్యాల, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉత్తర తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం 7,597 కోట్ల రూపాయల భారీ నిధులు విడుదల చేసింది. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి తెలిపారు. ఆర్మూర్--జగిత్యాల--మంచిర్యాల, జగిత్యాల--కరీంనగర్ జాతీయ రహదారులను నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆమె పేర్కొన్నారు. ఈ పనుల ద్వారా రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని, రైతులు తమ పంటలను మార్కెట్లకు త్వరగా తరలించగలరని తెలిపారు. రహదారుల విస్తరణతో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పెరిగి యువతకు ఉపాధి లభిస్తుందని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపడటంతో ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో ఈ రహదారి ప్రాజెక్టులు మైలురాయిగా నిలుస్తాయని డాక్టర్ భోగ శ్రావణి స్పష్టం చేశారు.


# వర్షాలతో జలమయమైన రహదారులు

**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



స్మార్ట్ సిటీ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా కరీంనగర్ నగరంలో భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు, నీటి పారుదల లోపాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కట్టరాంపూర్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన రహదారి మధ్యలో గ్యాప్ వదిలేయడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని మంచిర్యాల చౌరస్తా కూడా మోకాళ్ల లోతులో నీటితో నిండిపోయి రాకపోకలకు అంతరాయం కలిగించింది. స్థానికులు గతంలోనూ ఇదే సమస్యలు ఎదురైనప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరిచి, స్మార్ట్ సిటీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ అరెస్టును ఖండిస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలో అనుమతులు లేకుండా రేసోనన్స్ కళాశాల సదస్సు నిర్వహించడాన్ని ప్రశ్నించిన ఫార్వర్డ్ బ్యాంక్ పార్టీ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంద గణేష్ తీవ్రంగా ఖండించారు. అనుమతులు లేకుండా సదస్సు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోకుండా, ప్రజాస్వామ్యంగా ప్రశ్నించిన నాయకులను అరెస్టు చేయడం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. పట్టణంలో అనుమతులు లేని విద్యాసంస్థలు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేపడుతున్నాయని, విద్యాధికారులు నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. అనుమతులు లేని విద్యాసంస్థలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని పోలీసులు గమనించాలని గణేష్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం అన్యాయం అని యూఎస్‌ఎఫ్‌ఐ ఖండించింది.

# ఆమనగల్ మున్సిపాలిటీలో వార్డు సభలు

**ఆమనగల్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం ప్రజల వద్దకే అధికారులను తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన వార్డు సభల భాగంగా గురువారం ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ, 5వ, 6వ, 13వ వార్డుల్లో పర్యటన జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ పత్య నాయక్ ,వైస్‌చైర్మన్ గీత ఆచారి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు అనూష శ్రీశైలం, పాపిశెట్టి రామకృష్ణ, మెప్మా పీడీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్



పత్యానాయక్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఆమనగల్ మున్సిపాలిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

## తంబాకు ఫ్రీ డిస్ట్రిక్‌గా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి




**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజి సమక్షంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ (డిఎల్‌సీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పొగాకు నియంత్రణ చట్టం 2003లోని ముఖ్య సెక్షన్లపై అధికారులకు వివరాలు అందించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కాప్టా చట్టం అమలు కీలకమని, జిల్లాను తంబాకు ఫ్రీ డిస్ట్రిక్‌గా మార్చేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. సెక్షన్ 4 ప్రకారం బస్టాండ్, రైల్వే స్టేషన్, ఆఫీసులు, హాస్పిటల్స్, విద్యాసంస్థలు, హోటళ్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధం. సెక్షన్ 5 ప్రకారం పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు నిషేధం. సెక్షన్ 6 ప్రకారం మైనర్లకు పొగాకు అమ్మడం, విద్యాసంస్థల పరిధిలో విక్రయాలు నేరం. అలాగే పొగాకు ప్యాకెట్లపై 85% వైశాల్యంలో ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరి. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే చట్టం సమర్థవంతంగా అమలవుతుందని, ప్రతి నెలా జాయింట్ టాస్క్‌ఫోర్స్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయిలో పీహెచ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విప్లవ్, కోఆర్డినేటర్ పోచయ్య, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాను తంబాకు ఫ్రీ డిస్ట్రిక్‌గా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం, ఆరోగ్యంపై అవగాహన సదస్సు



**తమ్మాపూర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి (పీఎన్) గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్బీ) అశ్విని తానాజీ వాకడే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామసభలో వర్షాకాల సన్నద్ధత, మురుగునీటి కాలువల శుభ్రత, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 14--15 సంవత్సరాల బాలికలకు ముందస్తు క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఆరోగ్య అవగాహన, వర్షాకాల సన్నద్ధత లక్ష్యంగా గ్రామసభ నిర్వహించబడింది.

## నేడు బలమైన పునాది, రేపటి ఉజ్వల భవిష్యత్తు - డీఈఓ ప్రశాంత్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో చిన్నారుల విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయడానికి ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి తెలిపారు. 2025--26 విద్యా సంవత్సరంలో 22 ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించగా, 2026--27లో మరో 58 పాఠశాలలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు ఆటల ద్వారా, ఆనందభరిత వాతావరణంలో బోధన అందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. పాఠశాలల్లో బొమ్మలు, విద్యా ఆట వస్తువులు, ఆకర్షణీయ గోడ చిత్రాలు, గ్రీన్ మ్యాట్లు, ప్రత్యేక లెర్నింగ్ కార్నర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలు, ఒక ఆయమ్మ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ పాఠశాలల ద్వారా చిన్నారుల్లో పాఠశాల పట్ల ఆసక్తి పెరగడంతో పాటు ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. నేడు బలమైన పునాది, రేపటి ఉజ్వల భవిష్యత్తు అని డీఈఓ ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**ఖానాపూర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రజలకు తెలియజేస్తూ మస్కాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్స్, ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సీఎం కిట్స్, బూట్లు, బ్యాగులు, రాగి జావ వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. గత సంవత్సరం 150 మంది విద్యార్థులు పదవ తరగతి పూర్తి చేయగా, ఈ సంవత్సరం 250 అడ్మిషన్లు వస్తాయని హెడ్‌మాస్టర్ జాడి శ్రీనివాస్ తెలిపారు. ఇంటింటి సర్వే, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సిబ్బంది, సర్పంచులు, ఆప్ చైర్మన్లు కృషి చేస్తున్నారు. పాఠశాలలో మరమ్మతులు, ఫర్నిచర్, ఆటస్థలాలు, కంప్యూటర్లు, పారిశుధ్య సిబ్బంది నియామకం చేపడతామని అధికారులు తెలిపారు. మస్కాపూర్ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో ట్రిపుల్ ఐటీ బాసర్‌లో అడ్మిషన్లు పొందడం, ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్లు సాధించడం గర్వకారణమని హెచ్‌ఎం పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లలో కటౌట్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు పెరగడంతో ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గి, అడ్మిషన్లు పెరుగుతున్నాయి.

## రైతాంగ సమస్యలపై ఏఐయుకేఎస్ ధర్నా




**ఖానాపూర్, జూన్ 4 (నీలిమల ఎక్స్‌ప్రెస్)**
: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో ఖానాపూర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఉచితంగా ఇవ్వాలని, కల్తీ విత్తనాలను అరికట్టాలని, కల్తీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ పనిముట్లు సగం సబ్సిడీపై ఇవ్వాలని, ఎంఎస్పీ చట్టం చేయాలని, ఇండో--అమెరికన్ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ మండల నాయకులు జక్కుల రాజన్న, గోరే బాయ్, అడ్లగట్ట శంకర్, గోనే నారాయణ, వర్మ, జైతూ, నర్సింగరావు, లింగాల శంకర్ తదితరులు పాల్గొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధంగా ఉండాలని నందిరామయ్య పిలుపునిచ్చారు.

## ఘనంగా వంశీచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వెల్దండ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. డీసీసీ ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, మండల అధ్యక్షుడు హరి కిషన్ సింగ్, జిల్లా నాయకుడు మోతిలాల్ నాయక్, డీసీసీ కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు ప్రాజెక్టులను పరిశీలించేందుకు జిల్లాకు వస్తున్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి నాయకత్వంలో మహనీయుల జ్ఞాన చైతన్య బస్సు యాత్ర వెల్దండకు చేరుతుంది. ఈ యాత్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రకులాల్లో పేదలకు చైతన్యం కల్పిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఈదులపల్లి శీను, గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.

## కొడిమ్యాల ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**గంగాధర, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం స్వీకరిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మొయినొద్దీన్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో వల వేసిన ఏసీబీ అధికారులు, లంచం తీసుకుంటున్న సమయంలోనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు జరిపి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. లంచం స్వీకరణపై ఏసీబీ చర్యలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ పోలీసులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొమ్మకల్‌కు చెందిన పొలు గణేష్, సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పప్పు హరీష్ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద పట్టుబడ్డారు. చేగుర్తి గ్రామానికి చెందిన ఎలకపెల్లి నవీన్ కుమార్, అక్షయ్ దుర్షెడ్ వద్ద పట్టుబడ్డారు. ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇటీవల పట్టుబడిన అరుణాచలంను ఏఎంఆర్ఓ ముందు హాజరుపరచి బైండ్‌ఓవర్ చేశారు. ఇదివరకు బైండ్‌ఓవర్ అయినప్పటికీ మళ్లీ అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నాగపూరి అజయ్, పొలు గణేష్‌లను బౌండ్‌డౌన్ చేసి లక్ష రూపాయల జరిమానా విధించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## నిట్టూరులో బాధితులను పరామర్శించిన దాసరి మనోహర్ రెడ్డి


**పెద్దపల్లి, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



: నిట్టూరులో లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం, పోలీసుల తొందరపాటు చర్యల వల్ల సామాన్యులు బాధితులుగా మారడం విచారకరమని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న జరిగిన లాఠీచార్జ్‌లో గాయపడిన వారిని ఆయన గురువారం నిట్టూరు సర్పంచ్ భర్త ఆకుల శ్రీనివాస్ నివాసంలో పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, లారీల అతివేగంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. లారీ ఢీకొని కరెంటు పోల్ విరిగిన ఘటన తర్వాత గ్రామస్తులు గుమికూడగా, ఎలాంటి విచారణ లేకుండా పోలీసులు లాఠీచార్జ్ చేయడం ఖండనీయమని అన్నారు. సంబంధం లేని ప్రజలపై దాడి చేయడం నిబద్ధత గల అధికారులకు తగదని, ఈ ఘటనపై డీసీపీకి ఫిర్యాదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లారీల వేగాన్ని నియంత్రించాలని, గ్రామస్తులకు భద్రత కల్పించాలని కోరారు. బాధితులకు, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ తరఫున దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు వెంటనే చేయాలని రైతుల డిమాండ్

**కొండపాక, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో వరి కోతలు పూర్తయినా ధాన్యం సేకరణ జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో రోడ్డుపై కుప్పలుగా పడి ఉన్న ధాన్యం నష్టపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్ పూర్తయి ఖరీఫ్ సీజన్ విత్తనాల సమయం వచ్చినా పంట అమ్ముడుపోకపోవడంతో పెట్టుబడులకు డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ సమస్యలను అర్థం చేసుకొని అధికారులు వెంటనే ధాన్యం సేకరణ చేపట్టాలని కోరుతున్నారు.


# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**- నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**



**నల్లగొండ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నల్గొండ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లతో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “మహిళా సంఘాల ద్వారా పావలా వడ్డీ రుణాలు అందిస్తున్నాం. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆదర్శంగా నిలవాలి” అని సూచించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో కార్పొరేషన్‌ను ఇతర నగరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు పాలకూరి సుమలత సంతోష్ గౌడ్, పిల్లి కృష్ణంరాజు, కౌసర్, రేగట్టే అండాలు లింగస్వామి, ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ప్రదీప్ నాయక్, జానయ్య, నాయకులు దోనాల నాగార్జున రెడ్డి, నకిరేకంటి సైదులు, ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయలు ఇవ్వాలి - నారీ ఐలయ్య




**నల్లగొండ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిడమనూరులో జరిగిన మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టంలో 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలన్నిటికి సంవత్సరానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మికులకు పెన్షన్, ఆహార భద్రతా కార్డులు, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మిక హక్కులను హరించాయని, వాటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెంచిన ధరలను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కొండేటి శ్రీను, జటాపత్తు రవి నాయక్, కందుకూరి కోటేష్, కోమండ్ల గురవయ్య, రాం రాజు, బచ్చనబోయిన శివ, కొంచెం శేఖర్, సోమమ్మ, మాతంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిక్లరేషన్ హామీల అమలుకు పోరాటం కొనసాగిస్తాం



**కనగల్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కనగల్ మండలం తుర్కపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ప్రతి మహిళకు నెలకు ?2,500 ఆర్థిక సహాయం, వడ్డీ లేని రుణాలు, రాజకీయాల్లో 25 శాతం ప్రాతినిధ్యం, విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు, స్కూటీలు వంటి హామీలు ఇప్పటికీ అమలుకాకపోవడం దురదృష్టకరమని ఆమె విమర్శించారు.జిల్లావ్యాప్తంగా సర్వేలు నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని ప్రభావతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.కె. సుల్తానా, ఆదిమల్ల మారెమ్మ, బయలు యాదమ్మ, మీనమ్మ, లక్ష్మి, ప్రశాంతి, దుర్గమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆర్డీఓ మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీఐఏఎస్

**-రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్.**



**దేవరకొండ జూన్ 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) గా బాధ్యతలు స్వీకరించిన పద్మప్రియ ని గురువారం ఆర్టీఐ యాక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతోసత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలు, పరిపాలనాంశాలపై చర్చించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచేందుకు, నిరుపేదలకు, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూనూతన ఆర్డీఓ పద్మప్రియ విధులు నిర్వహణలో దేవరకొండ డివిజన్ లోని రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవని ఆశిస్తున్నాం. సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు, ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడంలో నూతన అధికారిణి చొరవ చూపాలని ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ కోరారు.

## వంశీచంద్ రెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



**ఆమనగల్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పట్టణంలో ఏఐసీసీ సభ్యులు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తూ, ప్రజాసేవే నిజమైన వేడుక అని ఆయన సందేశం ఇచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి. బాబా, గాజుల సురేష్, కండె సాయి గుప్తాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట, రాములపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 2026--27 విద్యాసంవత్సరానికి ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ తరగతుల నిర్వహణ కోసం ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా విద్యాధికారి శారదా నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంఈఓ నరేంద్ర చారి తెలిపారు.తాత్కాలిక ప్రాతిపదికన గౌరవ వేతనంతో 10 నెలల కాలానికి నియామకాలు జరగనున్నాయి. ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అవసరం. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. స్థానికత ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, అదే గ్రామ పంచాయతీ పరిధిలోని అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు.అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లతో జూన్ 9లోపు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వద్ద సమర్పించాలని కోరారు.

## బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ అవగాహన సదస్సు





**వెల్దండ, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ సభ్యత్వ నమోదు, SIR అవగాహన సదస్సు గురువారం వెల్దండలోని తోడేటి చిన్నారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగింది.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఇంచార్జ్ మెట్టు శ్రీనివాస్, కల్వకుర్తి ఇంచార్జ్ రజిని సాయిచంద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రతి కార్యకర్త డిజిటల్ సభ్యత్వం నమోదు చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలి. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం” అని పిలుపునిచ్చారు.సదస్సులో మండల అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, లింగం, జంగిలి యాదగిరి, పోలే అశోక్, జంగిలి ప్రవీణ్, జంగిలి ప్రసాద్, టైలర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించాలి


**జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి సూచనలు**



**కరీంనగర్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని, ఈ విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచేందుకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడు నలుమాసు సుదర్శన్ ప్రధానోపాధ్యాయులు సూచనలకు అనుగుణంగా ముందుకు సాగుతారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాపల్లి శ్రీనివాస్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరగా, త్వరలో నిర్వహిస్తామని ప్రశాంత్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అనురాధ, అశోక్ రెడ్డి, భగవంతయ్య, శోభారాణి, పద్మ, అనిత కుమారి, శశికాంత్ రెడ్డి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం అమలును స్వాగతిస్తున్నాం

**- హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామి గౌడ్**



**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** న్యాయవాదుల రక్షణ చట్టం నెంబర్ 16, జీవో ఎంఎస్ నెంబర్ 41 ప్రకారం జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర న్యాయశాఖ గెజిట్ నోటీసు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామి గౌడ్ తెలిపారు.ఈ చట్టం ద్వారా న్యాయవాదులకు వృత్తిపరమైన భద్రత కల్పించడంతో పాటు, వేధింపులు, హింస, బెదిరింపుల నుంచి రక్షణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని వివరించారు.వృత్తి నిర్వర్తించే సమయంలో బెదిరింపులు లేదా ప్రాణహాని ఉందని భావించే న్యాయవాదులకు పోలీస్ రక్షణ పొందే హక్కు ఉంటుందని, న్యాయవాదులపై దాడులు జరిగితే నాన్ బెయిలబుల్ కేసులుగా పరిగణించి గరిష్టంగా 7 సంవత్సరాల శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.అదేవిధంగా, న్యాయవాదులను అరెస్టు చేయాలంటే తప్పనిసరిగా న్యాయస్థానం అనుమతి అవసరమని చట్టంలో నిబంధనలు ఉన్నాయని వివరించారు. ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జనసేన పార్టీ కార్యకర్త పై ఫిర్యాదు




**దేవరకొండ జూన్ 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఈ నెల 2వ తారీఖున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖలు చేసిన దేవరకొండ మండలం, కొర్రతండా గ్రామ పంచాయతీకి చెందిన జనసేన పార్టీకి చెందిన కార్యకర్త కొర్ర చందుపై దేవరకొండ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ అట్టి వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవరకొండ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కి పిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొర్ర రాంసింగ్ నాయక్, ఆంజనేయులు,హరిష్ , రాజు యూత్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఎస్సీ వర్గీకరణ కుల ధృవీకరణ పత్రాల జారీని వేగవంతం చేయాలి

**-ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించిన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ యేకుల రాజారావు.**

**దేవరకొండ, జూన్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణ నేపథ్యంలో, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన కొత్త కుల ధృవీకరణ పత్రాలనుజారీ చేయాలని బహుజన వాది, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఏకుల రాజారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దేవరకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)కి ఆయన ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ యేకుల రాజారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 14 ఏప్రిల్ 2025 నుండి అమల్లోకి వచ్చేలా మాల, మాదిగ ఉప-కులాలు సహా మొత్తం 57 ఎస్సీ ఉప-



కులాలను మూడు వర్గాలుగా విభజించి వర్గీకరణను అమలు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యార్థుల విద్యా వసతులు, నిరుద్యోగుల ఉద్యోగ నియామకాలు, రిజర్వేషన్లు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందడానికి ఈ నూతన వర్గీకరణతో కూడిన కుల ధృవీకరణ పత్రాలు అత్యంత విధిగా మారాయని పేర్కొన్నారు.
అయితే, నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్ల నుండి వచ్చిన అనేక దరఖాస్తులు ప్రస్తుతం ఆర్డీఓ ఆఫీస్ పరిధిలో పరిశీలన మరియు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్టిఫికేట్ల జారీలో జరుగుతున్న ఆలస్యం వల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత విద్యా, ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని, వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.నిబంధనల పరమైన ఆలస్యం కారణంగా ఏ ఒక్క దరఖాస్తుదారుడు నష్టపోకుండా ఉండాలంటే, ఆర్డీఓ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లందరికీ తగిన ఆదేశాలు జారీ చేసి, పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆయన వినతిపత్రంలో ఆర్డీఓను అభ్యర్థించారు. ఈ వినతి పత్రం సమర్పించిన డాక్టర్ యేకుల రాజారావు తో పాటు యేకుల సురేష్, పంబాల పర్వతాలు, ఎర్ర వెంకటయ్య,చేపూరి మురళి తదితరులు ఉన్నారు.

# వంశీచంద్ రెడ్డి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి



**ఆమనగల్లు, జూన్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ఈయుఐ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేట్లు కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. దేవాలయాలు, దర్గాలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు చేపట్టారు. కడ్తాల్, ఆమనగల్లు కేంద్రాల్లో స్వీట్లు పంచుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, నాయకులు గుర్రం కేశవులు, అవ్వారి శివలింగం, గాజుల సురేష్, బాబా, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, కండె సాయి, కరీం, రహీం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, విజయ్ నాయక్, శేఖర్ గౌడ్, దేవరశెట్టి మహేష్, కృష్ణ, సురేష్ నాయక్, కొండల్ రెడ్డి, రఘు, కొండల్ రెడ్డి, రఫీ, షఫీ, రవి, పాతకోట రాజు, శ్రీను నాయక్, శ్రీధర్ నాయక్, ఫిరోజ్, బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలితాలు





మేషరాశి
సన్నిహితులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవచింతన పెరుగుతుంది. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. అదృష్ట రంగు ఎరుపు,సంఖ్య 6

వృషభరాశి
ముఖ్యమైన వ్యవహారాలలో ఆప్తుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు. అదృష్ట రంగు తెలుపు, సంఖ్య 7

మిధునరాశి
చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలించవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. అదృష్ట రంగు ఆకుపచ్చ, సంఖ్య 8

కర్కాటకరాశి
సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారమున మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. అదృష్ట రంగు వెండి, సంఖ్య 9

సింహరాశి
దూరప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. ఇంటాబయటా కొన్ని సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. ధన పరంగా చికాకులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది. అదృష్ట రంగు బంగారం, సంఖ్య 9

కన్యరాశి
దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. మిత్రులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ప్రత్యర్థులు కూడా మిత్రులుగా మారతారు. నూతన వాహన యోగం ఉన్నది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అదృష్ట ఆకుపచ్చ, సంఖ్య 2

తులరాశి
దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. అదృష్ట రంగు తెలుపు సంఖ్య 3

వృశ్చికరాశి
చేపట్టిన పనులు మందగిస్తాయి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు తప్పవు. వ్యాపారాలు కొంత నిరుత్సాహ పరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. అదృష్ట రంగు మెరూన్, సంఖ్య 4

ధనస్సురాశి
వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబసభ్యుల నుంచి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. అదృష్ట రంగు పసుపు,సంఖ్య 5

మకరరాశి
సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమవుతాయి. గృహ నిర్మాణ విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకొని పాత విషయాలు చర్చిస్తారు. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. అదృష్ట రంగు నీలం,సంఖ్య 7

కుంభరాశి
దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో చిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అదృష్ట రంగు నీలం, సంఖ్య 7


మీనరాశి
చేపట్టిన పనులలో శ్రమకు ఫలితం కనిపించదు. ఆస్తి తగాదాలు మరింత చికాకు కలిగిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

**అదృష్ట రంగు పసుపు, సంఖ్య 8**

**శ్రీ కాలబైరవ ఉపవాసకులు**

**దక్క జంబులయ్య (స్వామి )**

**9491163914**



# ఎలిగేడు సర్పంచ్‌కు ఘన సన్మానం



**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి సత్కరించారు.సర్పంచ్ ప్రవీణ్ గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచరుగా పనిచేసి అనేకమంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని ఉపాధ్యాయులు గుర్తుచేశారు. ఆయన కృషి వల్ల పాఠశాల ప్రతిష్ట పెరిగిందని, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందిందని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సుల్తానాపూర్‌కు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు



సుల్తానాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం



సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య

**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామపంచాయతీకు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 సందర్భంగా వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో పంచాయతీ చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శివ తెలిపారు.ఈ అవార్డును జూన్ 5న శుక్రవారం హైదరాబాద్ సనత్‌నగర్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, కార్యదర్శి శివ స్వీకరించనున్నారు.

# మూడు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు

**ప్రజా సమస్యలపై చర్చ, సూచనలు**

**ఎలిగేడు, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ఎలిగేడు, ధూళికట్ట, బుర్హాన్మియాపేట గ్రామాల్లో గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్థులకు తడి--పొడి చెత్త వేరు చేయడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అనుకూలమైన



ఎలిగేడు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్

పంటలను వేసుకోవాలని సూచించారు. పొలాల్లో వరి కోయలను కాలపెట్టవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం



అందించే పథకాలను అర్హులైన పేదలకు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, గోపు రజిత--లక్ష్మారెడ్డి, మారం కొమురయ్య, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కరరావు, ఏవో ఉమాపతి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిజినెస్

## పౌల్ట్రీకి దాణా ఖర్చు సెగ..

**- 25% వరకు తగ్గించుకున్న ఉత్పత్తి**



**న్యూఢిల్లీ, జూన్ 4**
దేశీయ పౌల్ట్రీ రంగానికి దాణా ఖర్చుల సెగ గట్టిగానే తాకింది. ఈ దెబ్బకు పౌల్ట్రీ సంస్థలు ఉత్పత్తిని 25 శాతం వరకు తగ్గించుకునే యోచనలో ఉన్నాయని ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్(ఏఐపీబీఏ) తాజాగా వెల్లడించింది. వీటికి తోడు జూలై నుంచి అక్టోబర్ మధ్యకాలంలో పండుగ సీజన్ కావడంతో చికెన్‌కు డిమాండ్ పడిపోనుండటం కూడా ఉత్పత్తి కోత పెట్టడానికి ప్రధాన కారణాలని ఏఐపీబీఏ చైర్మన్ బహదూర్ అలీ తెలిపారు.అలాగే సోయాబీన్ మీల్ ధరలు గడిచిన కొన్ని నెలల్లో 40 శాతం వరకు పెరుగడంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీపై దాణా పిడుగు పడినట్టు అయిందన్నారు. ఉత్పత్తి వ్యయం పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పౌల్ట్రీ సంస్థలపై జూలై నుంచి అక్టోబర్ వరకు నవరాత్రి, శ్రావణ, కార్తిక మాసం ఉండటంతో కొనుగోళ్లు పడిపోనున్నాయన్నారు.

## నేడు ఆర్బీఐ పరపతి సమీక్ష

**ముంబై,**
రిజర్వుబ్యాంక్ తన ద్రవ్య పరపతి సమీక్షను శుక్రవారం ప్రకటించనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రెండో ద్వైమాసిక పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలు మెండుగావున్నాయని, లేకపోతే వడ్డీరేట్లను పావు శాతం పెంచే అవకాశం ఉన్నదని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమనడంతో ధరల సూచీ ఆకాశమే హద్దుగా దూసుకుపోయే అవకాశాలుండటం ఈసారి సమీక్షలో రిజర్వుబ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నిర్ణయం కీలకంగా మారింది. ఆరుగురు సభ్యులు కలిగిన




పరపతి సమీక్ష సమావేశం బుధవారం ప్రారంభమై శుక్రవారం తన నిర్ణయాన్ని ప్రకటించనున్నది. ఈ సమీక్షపై పీటీఐ నిర్వహించిన పోల్‌లో పలువురు ఆర్థికవేత్తలు తమ నిర్ణయాన్ని ప్రకటించారు. వీరిలో 11 మంది వడ్డీరేట్ల యథాతథ స్థితికి ఓటు వేయగా, నలుగురు మాత్రం పావు శాతం పెంచే అవకాశం ఉన్నదని తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ద్రవ్యోల్బణ రిస్క్ కారణంగా ఈ ఏడాది సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను రెండు సార్లు సవరించే అవకాశాలున్నాయని అత్యధిక మంది అభిప్రాయపడ్డారు. ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటంతో ఆర్బీఐ కూడా ఈసారి వడ్డీరేట్లను స్థిరంగా ఉంచే అవకాశాలున్నాయన్నారు.

## మారుతి తొలి ఇథనాల్ కారు..

**-వ్యాగన్‌ఆర్ మాడల్‌ను ఆవిష్కరించిన సంస్థ**

**న్యూఢిల్లీ,**
కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..తన తొలి ఇథనాల్ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారైన వ్యాగన్‌ఆర్ మాడల్‌ను పరిచయం చేసింది. ఇథనాల్-బ్లెండెడ్ ఫ్యూయల్‌తో నడిచే ఈ కారుతో సాధారణ పెట్రోల్ కార్లతో పోలిస్తే ఈ నయా వ్యాగన్‌ఆర్ మాడల్ 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్‌తో నడువనున్నదని మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి తకేచి తెలిపారు.. ఈ కారు ధర ప్రస్తుతం సంస్థ వెల్లడించకపోయినప్పటికీ, రూ.8 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. 2024లో న్యూఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో ఈ కారును ప్రదర్శించిన మారుతి..రెండేండ్ల తర్వాత మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది. సీఎన్‌జీ, ఎల్‌పీజీ వాహనాలకు ప్రత్యామ్నాయంగా సంస్థ ఈ మాడల్‌ను తీసుకొచ్చినట్టు చెప్పారు. తద్వారా చమురు వాడకం తగ్గడంతోపాటు విలువైన విదేశీ మారకం చెల్లింపులు తగ్గే అవకాశం ఉండటం, కాలుష్యం మరింత తగ్గనున్నదన్నారు. ఈ కారును కేంద్ర




మంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పూరి ఆవిష్కరించారు.

**ఇథనాల్ పంపుల కొరత**

చమురు దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ఒకవైపు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ మరోవైపు, ప్రత్యామ్నాయాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఈవీల వాడకాన్ని పెంపొందించడానికి తీసుకుంటున్న చర్యలు..వీటి కోసం చార్జింగ్ పాయింట్ల ఏర్పాటును పెద్దగా ప్రోత్సహించడం లేదు. దీంట్లోభాగంగా ప్రస్తుతం విడుదలైన ఇథనాల్ కారు ఇంధన సరఫరాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని తెలుస్తున్నది. నూఢిల్లీ సర్కిల్‌లో ప్రస్తుతం 50 నుంచి 100 ప్రాంతాల్లో మాత్రమే ఇథనాల్ అవుట్‌లెట్లు మాత్రమే ఉన్నాయని, వీటిని పెంచాలనే డిమాండ్ నెలకొన్నది.

# స్పోర్ట్స్

## నెంబర్ వన్ చేతిలో మళ్లీ ఓడిన పీవీ సింధు.. ఇండోనేషియా ఓపెన్ నుంచి ఔట్

జకార్తా
ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఇండోనేషియన్ ఓపెన్‌లో ఇవాళ ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమ పరాజయాన్ని చూవిచూసింది. 17-21, 14-21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం. జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10-10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15-14 లీడ్ సాధించింది. కానీ ఆన్




దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

## అంతర్జాతీయ క్రికెట్‌కు శ్రీకర్ భరత్ గుడ్‌బై

**32 ఏండ్లకే రిటైర్మెంట్ ఇచ్చిన ఏపీ కికెటర్**

న్యూఢిల్లీ
భారత వికెట్ కీపర్ బ్యాటర్, ఏపీ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ 32 ఏండ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట నుంచి తప్పుకుంటున్నట్లు గురువారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించాడు. రిషబ్ పంత్ అందుబాటులో లేని సమయంలో కేఎస్ భరత్ టెస్టు జట్టులోకి వచ్చాడు. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో ఏడు టెస్టులు మ్యాచ్‌లు ఆడిన భరత్.. బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు.కేవలం 221 పరుగులు మాత్రమే సాధించాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టు తరపున సుదీర్ఘ కాలం పాటు స్థిరమైన ప్రదర్శన ఇచ్చిన భరత్.. 113 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 6102 రన్స్ చేశాడు. ఐపీఎల్‌లో పది మ్యాచ్‌లు ఆడాడు. దేశం తరపున ఆడటం తన జీవితంలో దక్కిన అత్యంత గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్న భరత్ ఈ ప్రయాణంలో



తనకు అండగా నిలిచిన బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ సంఘం, తన కెప్టెన్లు కోహ్లీ, రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ధన్యవాదాలు తెలిపాడు.

## ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం



**ముంబై**
ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ టోర్నీలో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. 37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపీఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం. అయితే రోహిత్ శర్మ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా తెలియదు. ఐపీఎల్‌లో రోహిత్‌కు కూడా తొడకండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. అయినా అతన్ని భారత జట్టుకు తీసుకున్నారు.టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న కోహ్లీ, రోహిత్‌లు.. వన్డేలపై దృష్టి పెట్టారు. అయితే వచ్చే ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరూ ఆడుతారేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఆఫ్ఘనిస్తాన్‌తో లక్నోలో 17న రెండో వన్డే, చెన్నైలో 20న మూడో వన్డే జరగనున్నది.